క్లుప్తంగా

బీసీ హాస్టల్ పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న తిరుమలరావు

కంచిలి: మండల కేంద్రం కంచిలి బీసీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో వి.తిరుమలరావు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాత్రి భోజనాల ప్రక్రియ, టాయిలెట్స్, విద్యార్థులు ఉంటున్న గదులు పరిశీలించారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పలు సూచన లిచ్చారు. ఎంఈవో-1 ఎస్.శివరాంప్రసాద్ ఉన్నారు. అలాగే బొగాబెణి పంచాయతీ పరిధి సోన్నేడు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను కూడా ఎంపీడీవో పరిశీలించారు. ఏపీవో జి.ధనుంజయ, ఫీల్డ్ అసిస్టెంట్ రుషి ఉన్నారు.

వేకువజామున పారిశుద్ధ్య పనుల పరిశీలన



తిలక్‌నగర్‌లో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలో బుధవారం వేకువజామున పర్యటించారు. 13వవార్డు తిలక్‌నగర్‌లో రోడ్డు స్వీపింగ్ పనులను వేకువజామున 5.30 గంటల సమయంలో పరిశీలించారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న శానిటేషన్ పరిస్థితిని సమీక్షించారు. పలాస 24వవార్డు కేటీ రోడ్డు ఇందిరా చౌకు వద్ద గల డంపర్ బిన్‌లో గార్బేజ్‌ను కాంపాక్టర్ వెహికల్‌తో క్లియర్ చేయించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పలాస, మొగిలిపాడు రోడ్డు పక్కన గల పిచ్చిమొక్కలను తొలగించే ప్రక్రియను పర్యవేక్షించారు. 13వవార్డు న్యూకాలనీలో పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్డులోని అన్న క్యాంటిన్‌లో ఉదయం అల్పాహార నాణ్యతను పరిశీలించారు.

జాతీయ సదస్సుకు ఉద్దానం ఉపాధ్యాయుడు



కీలు ఖగపతి

మందస: రాష్ట్ర విభజనకు ముందు ఉపాధ్యాయునిగా ఎంపికై ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న ఉద్దాన ప్రాంత మందస మండలం భేతాళపురానికి చెందిన కీలు ఖగపతి మాస్టారు జాతీయ స్థాయి సదస్సుకు ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి 20 వరకు ఢిల్లీలోని సీసీఆర్టీలో నూతన విద్యా విధానం -2020లో తోలుబొమ్మలు పాత్ర అనే అంశంపై జరిగే జాతీయస్థాయి సదస్సు, శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ వారు తమ రాష్ట్రం తరఫున ఖగపతిని ఎంపిక చేశారు. ఖగపతి ఎంపిక పట్ల ఉద్దాన ప్రాంత వాసులు, విద్యావేత్తలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి

ఇచ్ఛాపురం: ఇంటర్ పూర్తయిన తరువాత ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరాలని అధ్యాపక బృందం కోరింది. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉందన్నారు. అన్నిరకాల వసతులు ఉన్నాయని, నాక్-బీ గుర్తింపు ఉన్న నేపథ్యంలో ఇదే కళాశాలలో డీగ్రీలో చేరాలని కోరారు అధ్యాపకులు దుర్యోధన దోళాయి, పి.శివకుమార్, సీతమ్మ, ఎం.నాగేశ్వరరావు, డి.మోహన్‌రావు, సంతోష్, ఈశ్వరరావు, లోకేష్, బృందావన్, శివప్రసాద్ ఉన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ

నందిగాం: జయపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఎంపీడీవో రాజారావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు సమకూర్చిన వసతులు, భోజనం, మంచినీటి సదుపాయం, పాఠశాలలో ఉన్న స్టాక్ వివరాల గురించి విద్యార్థుల నుంచి ఆరా తీశారు.

విలీన గుబులు!

- సంస్కరణల పేరుతో తరగతుల విలీనం
- ఫలితంగా డ్రాపౌట్స్ పెరిగే అవకాశం

కంచిలి:

తరగతుల విలీన గుబులు చిన్నారులను వెంటాడుతోంది. సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం సవ్యంగా సాగుతున్న విద్యా వ్యవస్థను అడ్డగోలు ప్రయోగాలతో అభాసుపాల్జేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతన విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలలను, ప్రాథమికోన్నత పాఠశాలలను తగ్గించే ప్రతిపాదనలు చేయడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు స్వాగతించడం లేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో పరిశీలిస్తే ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్ని వేరే పాఠశాలల్లో విలీనం చేయడానికి చేసిన ప్రతిపాదనలను విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే పలు పాఠశాలలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ వ్యతిరేకాన్ని అధికారుల ముందు బహిర్గతం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ విధానానికి తాము అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు.



తరగతులు తొలగించొద్దంటూ ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కొండపోలేరు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు

తెరపైకి కొత్త విధానం..

ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెబుతూ పలు కొత్త విధానాలను తెరపైకి తెచ్చింది. వీటిలో ఫౌండేషన్, బేసిక్, మోడల్ ప్రైమరీ పాఠశాలలంటూ చెప్పుకొచ్చింది. ఈ విధానంలో ఒక పంచాయతీలో ఉన్న పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా తయారు చేసేందుకు మిగతా ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3, 4 5 తరగతుల విద్యార్థులను తీసివేసి, మోడల్ ప్రైమరీగా ప్రతిపాదించే పాఠశాలలో విలీనం చేస్తామని ప్రతిపాదిస్తున్నారు. 60 మందిలోపు విద్యార్థులు ఉంటే బేసిక్ ప్రైమరీ పాఠశాలగాను, ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి వరకు మిగిలిపోయిన పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలగా, ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 9 తరగతులను ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉండే ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడానికి ప్రతిపాదించారు. ఈ విధానానికి క్షేత్రాస్థాయిలో పరిస్థితులు తగినట్లుగా లేవని కొన్ని పాఠశాలల పరిస్థితిని పరిశీలిస్తే అవగతమవుతుంది. కంచిలి మండలం బొగాబెణి పంచాయతీలో బొనమాళి పాఠశాలలో 3, 4, 5 తరగతులను జెన్నాఘాయి ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేసి.. ఆ పాఠశాలలో 6, 7, 8 తరగతులను ఐదు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఇలా విలీనం చేయడం వలన ఆ పంచాయతీ పరిధిలో డ్రాపౌట్స్‌గా పిల్లలు మిగిలిపోయే అవకాశం ఉంది. అదే పంచాయతీలో కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను బొగాబెణి ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేస్తామని ప్రతిపాదించారు. ఇలా ఈ పంచాయతీలో బొనమాళి, కుమ్మరిపేట ప్రాథమిక పాఠశాలలు ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్పుచేయడానికి ఆయా గ్రామస్తులు ససేమిరా అంటున్నారు. అలాగే పోలేరు పంచాయతీ కొండపోలేరు ప్రాథమిక పాఠశాలను ఆ గ్రామస్తులు ఒకే మాట మీద గ్రామంలో ఎవర్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్చకుండా కేవలం ఆ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోనే చదవాలను కట్టుబాటు పెట్టుకొని కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాలలో మూడు తరగతులను తీసుకెళ్లి పంచాయతీ కేంద్రం పోలేరు పాఠశాలలో విలీనం చేయడానికి వారి ఒప్పుకోవడం లేదు. ఈ పాఠశాల ల పరిధిలో విద్యార్థుల తల్లిదండ్రులంతా ఇప్పటికే మండల విద్యావనరుల కేంద్రానికి వచ్చి తమ నిరసనను వ్యక్తపరిచారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా తరగతుల విలీనాలకు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి.



3,4,5 తరగతులు తొలగించబోతున్న బొనమాళి ప్రాథమిక పాఠశాల

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మండలలాల వారీగా పాఠశాలల ప్రతిపాదనలు					
మండలం	ఫౌండేషన్	బేసిక్ ప్రైమరీ	మోడల్ ప్రైమరీ	యూపీ	ఉన్నత
ఇచ్ఛాపురం	11	11	32	0	16
కవిటి	25	25	37	01	14
కంచిలి	34	25	23	02	10
సోంపేట	19	21	21	0	17

విలీనం చేయవద్దు



మా పాఠశాలలో చదువుతున్న 3, 4, 5 తరగతులను పక్క పాఠశాల జెన్నాగాయిలో విలీనం చేస్తామని అంటున్నారు. ఇలా చేస్తే మా పాఠశాల విద్యార్థులు అంత దూరం చెరువులు దాటుకొని, బ్యాగులు మోసుకొంటూ వెళ్లి చదువుకోలేరు. చాలా మంది చదువులు మానేస్తారు. –గుడియా కుమారి, ఎస్‌ఎంసీ చైర్మన్, బొనమాళి ప్రాథమిక పాఠశాల

డ్రాపౌట్స్ పెరుగుతారు



సవ్యంగా నడుస్తున్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను తీసేసి పక్క పాఠశాలల్లో విలీనం చేసి, వాటిలో పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీ కల్పిస్తామని చెప్పడం సరికాదు. ఇలా చేయడం వలన అన్నిచోట్ల కచ్చితంగా డ్రాపౌట్స్ పెరుగుతారు.
–గణప సింహాచలం, సర్పంచ్, బొగాబెణి పంచాయతీ, కంచిలి మండలం

పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల కల్పన



నూతన విద్యావిధానంలో తక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను పంచాయతీలో ఒకే పాఠశాలలో విలీనం చేసి, అక్కడ అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించడం జరుగుతుంది. ఫలితంగా నాణ్యమైన విద్య అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. దీన్ని అర్థం చేసుకొని ప్రోత్సహించాలి.
–ఎస్.శివరాంప్రసాద్, ఎంఈవో–1, కంచిలి

మద్యం దుకాణాలకు 4 దరఖాస్తులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో గీత కార్మికులకు ప్రభుత్వం కేటాయించిన మూడు మద్యం దుకాణాల కోసం నాలుగు దరఖాస్తులు వచ్చాయని సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో రెండు, మండలం పరిధిలో ఒకటి, కవిటి మండలంలో ఒక దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై సమీక్ష

కాశీబుగ్గ: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై ఘన వ్యర్థాలను తగ్గించడమే ప్రధాన ఉద్దేశంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సూపర్‌వైజర్‌లు పనిచేయాలని మున్సిపల్ కమిషన్ నడిపేన రామారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం శానిటేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెత్త నుంచి సంపద, ఘన వ్యర్థాలు లేకుండా చూడటం, ఫ్రైడే నుంచి డ్రైడేగా పాటించాలని అన్నారు. పారిశుద్ధ్యంపై మెప్మా సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.

సారాతో మహిళ అరెస్టు

పలాస: రెంటికోట గ్రామానికి చెందిన దొతియా పార్వతి సారాతో పట్టుబడడంతో కాశీబుగ్గ ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమె నుంచి ఐదు లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నమని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు తెలిపారు. కాగా కల్లు గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాల కోసం అర్హులైన వారు ఈ నెల 8తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు అభినందనలు

నందిగాం: టెక్కలి నియోజకవర్గ స్థాయిలో మంగళవారం జరిగిన క్రీడా పోటీల్లో నందిగాం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. తొమ్మిదో తరగతి విద్యార్థి కోనారి హర్షవర్ధన్ 200, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి వ్యక్తిగత చాంపియన్ షిప్‌గా నిలిచాడు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు హరిబాబు, పీడీ జి.శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సోంపేట: సోంపేటలో వ్యాపారుల సమస్యలు పరిష్కరించి వ్యాపార అభివృద్ధికి కృషి చేయాలని వ్యాపార సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. సోంపేట పట్టణం నుంచి సాయంత్రం నాలుగు గంటల నుంచి వెళ్లేందుకు, రావడానికి బస్సులు సదుపాయం లేకపోవడంతో వ్యాపారాలు మందగిస్తున్నాయని, రవాణా సమస్య పరిష్కరించాలన్నారు. సోంపేట వ్యాపార సంఘాల ప్రతినిధులకు భవన సముదాయం కోసం స్థలం కేటాయించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చాంబర్ అధ్యక్షులు మల్లా నాగేంద్ర, కార్యదర్శి కొంచాడ రాంజీ, కోశాధికారి సానా రవి, ఉప కార్యదర్శి సింధిరి శ్రీనివాస్, 30 వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన వ్యాపార సంఘాల ప్రతినిధులు

కేంద్ర బడ్జెట్ పత్రాల దహనం

వజ్రపుకొత్తూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌కు వ్యతిరేకంగా రైతు సంఘం, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో బెండి, నగరంపల్లి గ్రామాల్లో బుధవారం ప్రజా సంఘ నాయకులు, ప్రజలు నిరసన వ్యక్తం చేస్తూ బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేవలం అదానీ, అంబానీ లాంటి సంపన్నులకు లాభం కలిగించేదే తప్పా..రైతులకు, కూలీలకు, కార్మికులకు, సామాన్య ప్రజలకు మేలు చేసేది కాదని అన్నారు. ఇది ఏ మాత్రం ప్రజా బడ్జెట్ కాదని,కేవలం పెట్టుబడిదారులకు మరింత ప్రయోజనం కలిగించేందుకు మాత్రమే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. రైతు సంఘ నాయకులు కె.బాలాజీ, కార్యదర్శి టి.భాస్కర రావు, సీఐటీయూ నాయకులు ఎస్.మోహన్‌రావు, కె.సూధన్, ఆర్.నీలాచలం.కె.అనంద్, నిర్మల, అనందరావు, లోకేశ్ ఉన్నారు.

తైక్వాండోలో ఇచ్ఛాపురం చిన్నారుల సత్తా



తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి తదితరులు

ఇచ్ఛాపురం: కాకినాడ ఇండోర్ స్టేడియంలో యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఇచ్ఛాపురం చిన్నారులు సత్తాచాటారు. ఈ విషయాన్ని కోచ్ సీహెచ్ దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. జనవరి 31 నుంచి ఈ నెల రెండో తేదీ వరకు కాకినాడ జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో ఎన్టీఆర్ మెమోరియల్ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో పాల్గొన్న ఇచ్ఛాపురం స్కూల్ ఆఫ్ తైక్వాండో నుంచి సీనియర్ విభాగంలో ఎ.భువనేశ్వరి, ఎస్.లక్ష్మణరావు, ఎస్.గణేష్‌కుమార్, అన్నపూర్ణ, భువనేశ్వరి, పిలక సత్యవతి బంగారు పతకాలు సాధించారు. అలాగే జూనియర్ విభాగంలో సీహెచ్ గిరి, ఎ.రేవంత్, ఎన్.భగవాన్ బంగారు, టి.జీవన్ వెండి, సబ్‌జూనియర్ విభాగంలో జి.హర్షిణి బంగారు, పిలక లాస్యరెడ్డి, యశ్విత వెండి, మనీష్, మోహిత్, మోక్ష, శ్రీవల్లి కాంస్య పతకాలతో మెరిశారు. క్యాడెట్ విభాగంలో సీహెచ్ జాహ్నవి వెండి, పి.ధమయంతి, ఎండీ నూరుద్దీన్, పి.విజ్ఞాన్, వంశీ కాంస్య, పోమ్సె భాగంలో పాలకొండ గెహ్నశ్రీ బంగారు పతకాలు సాధించారు.దీంతో వీరిని సురంగిరాజా క్రీడా మైదానం ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అభినందించి చాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేశారు. పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి, బి.కృష్ణయ్య, ఎల్‌సీ రావు, బత్తుల వెంకటరమణ, చాట్ల లోహిదాస్, ఆశిలత, తైక్వాండో అసిస్టెంట్ కోచ్ బి.జనార్దన్ పాల్గొన్నారు.

ఆర్డీవో ఆదేశాలు బేఖాతర్!

- చెరువు గర్భంలోని ఆక్రమణలు తొలగించని రెవెన్యూ అధికారులు

సంతబొమ్మాళి: ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించడం కింద స్థాయి ఉద్యోగుల కర్తవ్యం. అయితే నౌపడ సచివాలయం ఉద్యోగులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నౌపడలోని లచ్చయ్య ఒడ్డు చెరువు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకోవడంతోపాటు ఇంటి పట్టాలు ఇచ్చారని జనవరి 20వ తేదీన స్పందనలో గ్రామానికి చెందిన అనపాన నగేష్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించుకోవడంతో డ్రైనేజీ సమస్య తలెత్తిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు జనవరి 31వ తేదీన టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగించి బోర్డు ఏర్పాటు చేయాలని స్థానిక రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆర్డీవో ఆదేశాలతో మరుసటి రోజు ఫిబ్రవరి ఒకటో తేదీన పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల పొజిషన్లను రద్దు చేసి ఆ స్థలాన్ని జేసీబీతో చదును చేసి ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా చెరువును ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై వారం రోజులు కావస్తున్న ఎలువంటి చర్యలు తీసుకోలేదు. చెరువు స్థలం ఆక్రమణకు ఏ మేరకు గురైందో అనే సర్వే కూడా చేయలేదు. సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారికి నోటీసులు ఇచ్చి చేతులుదులుపుకున్నారు. దీనిపై ప్రజలు విమర్శలు చేస్తున్నారు. పేదవాడికి ఒక రూలా.. పెద్దవాళ్లకి మరో రులా అని ప్రశ్నిస్తున్నారు.



తొలగించని చెరువు గర్భంలోని ఆక్రమణలు

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

పలాస : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. సీఐటీయూ నాయకులు ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, సీహెచ్ వేణుగోపాల్, కామేశ్వర రావు, ఎస్.మోహనరావు, కె.బాలక్రిష్ణ, బి.దుర్యోధన, టి.లక్ష్మీనారాయణ, బి.వెంకటేష్, జి.బాలమ్మ, బి.చంద్రావతి, తెప్పల అజయ్ కుమార్, టి.సన్యాసిరావు ఉన్నారు.

రైతుల నిరసన ప్రదర్శన

పలాస: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాలను తప్పుపడుతూ రైతులు బుధవారం నిరసన తెలియజేశారు. 2025-26 బడ్జెట్ ప్రతులను పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో బుధవారం దగహనం చేశారు. జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ మాట్లాడుతూ... రాష్ట్రానికి గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు తగ్గించడం దారుణమన్నారు. జీడి పంటను కేంద్ర పంటల జాబితాలో చేర్చాలని కోరారు. మాజీ సర్పంచులు తెప్పల అప్పలస్వామి, గేదెల నీలకంఠం, బత్తిన ప్రసాద్, తెప్పల రాజు, జుత్తు వరలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సన్యాసిపుట్టుగ వీవోఏపై విచారణ

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగ వీవోఏ ఎం.ఈశ్వరిపై కేశుపురం ఎంపీటీసీ సభ్యుడు మాసుపత్రి చక్రవర్తిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఏరియా కోఆర్డినేటర్ సీహెచ్ రామ్మోహనరావు బుధవారం విచారణ చేపట్టారు. తనకు ఇష్టం వచ్చిన వారికి రుణాలు మంజూరు చేయడం, సంఘ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు చేసిన ఆరోపణలు నేపథ్యంలో సంఘ సభ్యులతో విచారణ సాగింది. అయితే చక్రవర్తిరెడ్డి ఫిర్యాదులో చేసిన ఆరోపణల్లో నిజం లేదని, కక్షపూరితంగా వీవోఏపై నిందలు వేసినట్లు సభ్యులు విచారణ అధికారులకు తెలియజేశారు. దీంతో ఆమెను యథావిధిగా వెలుగు ప్రాజెక్ట్‌లో కొనసాగిస్తున్నట్లు విచారణాధికారి రామ్మోహనరావు తెలిపారు. విచారణలో ఏపీఎం ఎస్.ప్రసాదరావు, శ్రీనిధి మేనేజర్ కె.రాము, సీసీలు పాల్గొన్నారు.



వీవోఏపై విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది

ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి

కంచిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు లాపాటి సరస్వతి, సీపీఐ నేత సాలిన నారాయణస్వామిల నేతృత్వంలో కంచిలి పంచాయతీ పరిధిలో ఇళ్లులేని వారితో కలిసి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీగా మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్‌కు వినతిపత్రంతో పాటు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు లోకంటి కుమారి, మారేడు రాజేశ్వరి, బతకల మీనా, లక్ష్మీకళ, మోహిని, శారద ఉన్నారు.



తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పుస్తకావిష్కరణ



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎంసీఏ విభాగం హెచ్‌ఓడీ తంగుడు నరేష్ సైబర్ సెక్యూరిటీ అనే పుస్తకాన్ని రచించారు. దీని ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణకు ఈ పుస్తకం ఎంతగానో దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఉన్నారు. –టెక్కలి

విద్యార్థినులకు సత్కారం

కంచిలి మండలం మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు బెంగళూరులో జాతీయ స్థాయిలో జరిగిన హాక్ టు ది ఫ్యూచర్ కాన్సెప్ట్‌లో ప్రతిభ కనబర్చి ఇన్నోవేషన్ చాంపియన్స్‌గా నిలిచారు. దీంతో వారిని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అభినందించారు. పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో దుశ్శాలువలతో సత్కరించారు. సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, పైల లక్ష్మీనారాయణలు ఉన్నారు. పాఠశాలకు మంచిపేరు తీసుకొచ్చేందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్ శివప్రసాద్, గైడ్ టీచర్ సత్యనారాయణను కూడా అభినందించారు. – కంచిలి



ఉచిత వైద్య శిబిరం



దంతాల ఆరోగ్యంపై ప్రతిఒక్కరు ప్రత్యేక దృష్టిపెట్టాలని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. జింకిభద్ర, బెంకిలి పంచాయతీల పరిధిలో శ్రీకాకుళానికి చెందిన శ్రీసాయి దంతవైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. సుమారు వంద మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రొఫెసర్లు నందిత, ప్రత్యూష, వైద్యులు బి.శిరీష, చందన వికాస్, రాఘవేంద్ర ప్రసాద్, గ్రామస్తులు తామాడ చంద్రశేఖర్, సాహుకారి జాని, జుత్తు పురుషోత్తం, మద్దు రవి పాల్గొన్నారు. –సోంపేట